ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 243
పేజీలు : 5 వెల రూ. 2/-
శనివారం
20 డిసెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## మెడికో విద్యారుణం కోసం ఇల్లు తాకట్టు

మాజీమంత్రి హరీష్ రావు పెద్దమనసు




2 లో

### ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా

# తేనీటి విందు

- స్వాగతించిన కలెక్టర్, ఎస్పీలు
- సరదాగా ముచ్చటించుకున్న సభ్యులు
- హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్
- ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా



2 లో

### ఉద్యోగ నియామకాల్లో

# పారదర్శకతకు పెద్దపీట

- సమస్యలపై వేగంగా స్పందించి..చర్యలు తీసుకోవాలి
- వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము




2 లో

## ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

- 74శాతం ఫిర్యాదులు పరిష్కరించాం
- రెండేళ్ల ప్రజావాణి వార్షికోత్సవంలో భట్టి విక్రమార్క



2 లో

## ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ

- ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి
- షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మంత్రి కోమటిరెడ్డి




2 లో

# 41మంది మావోయిస్టుల లొంగుబాటు

- డిజిపి శివధర్ ఎదుట లొంగిన నక్సల్స్
- లొంగిన వారిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి



2 లో

## పంచాయితీలకు సెలవ్ పెట్టండి

- ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి
- గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు
- ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి
- గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్



2 లో

# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట



**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్19:**
ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మయూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

# ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ

**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్19:**
దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభంగా, సౌకర్యవంతంగా సినిమాల నిర్మాణానికి తెలంగాణ ఎంతో అనుకూలంగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులతో కలిసి హైదరాబాద్ ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వెంకట్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ – 2025.. మన హైదరాబాద్‌కు, మన తెలంగాణకు ఒక మంచి ఆరంభం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటేనే సినిమాగా పేరుగాంచింద న్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి సినిమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద సినిమాలు ఒకవైపు.. షార్ట్ ఫిల్మ్స్ మరోవైపు తీయడం వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. కొత్త టాలెంట్ ఎక్కువగా షార్ట్ ఫిల్మ్స్ నుంచి వస్తోందన్నారు మంత్రి. షార్ట్ ఫిల్మ్స్ యువతకు ఫ్రీడమ్ ఇస్తాయని.. కొత్తగా ఆలోచించడానికి.. కొత్తగా ట్రై చేయడానికి.. తమ కథని తమ స్టైల్‌లో చెప్పడానికి.. అవకాశాన్ని కల్పిస్తాయన్నారు కోమటిరెడ్డి. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న చాలామంది ఫిల్మ్ మేకర్స్ మొదట షార్ట్ ఫిల్మ్స్‌తోనే మొదలుపెట్టారని గుర్తు చేశారు మంత్రి. సినిమాటోగ్రఫీ మంత్రిగా తాను ఒక విషయం స్పష్టంగా చెప్తున్నానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సినిమా రంగానికి పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారాయన. 'మంచి టాలెంట్‌కు




అవకాశం రావాలి.. యువ ఫిల్మ్ మేకర్స్ ముందుకు రావాలి.. వాళ్లకు సరైన ప్లాట్‌ఫామ్ ఉండాలి.. అదే మా ప్రభుత్వ ఆలోచన.' అని ఉద్ఘాటించారు మంత్రి కోమటిరెడ్డి. తమ లక్ష్యం చాలా సింపుల్ అని.. దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలన్నారు. అనుమతులు ఈజీగా ఉండాలి. సదుపాయాలు బాగుండాలి. అందుకోసం ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తోంది. ఈ ఫెస్టివల్‌లో నాకు ప్రత్యేకంగా నచ్చిన విషయం ఒకటి ఉంది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిల్మ్ మేకర్స్ పాల్గొనడం అని అన్నారు. ఎనిమిది రాష్ట్రాల కథలు ఇక్కడ మనం చూస్తున్నాం. హైదరాబాద్ అంటే మినీ ఇండియా. ఇలాంటి కార్యక్రమాలు మన దేశాన్ని ఇంకా దగ్గర చేస్తాయి. ఇక్కడ ఉన్న ప్రతి ఫిల్మ్ మేకర్‌కు నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే. అవార్డు వచ్చినా రాకపోయినా.. మీ కథకి విలువ ఉంది. 15–20 నిమిషాల షార్ట్ ఫిల్మ్ కూడా మనసులను తాకగలదు. ధైర్యంగా కొత్త కథలు చెప్పండి. ముందుకు వెళ్లండి.' అంటూ యువ ఫిల్మ్ మేకర్స్‌లో ఉత్తేజాన్ని నింపారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. హైదరాబాద్‌లో ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడం తెలంగాణకు మైలురాయిగా పేర్కొన్న మంత్రి కోమటిరెడ్డి.. యువ ప్రతిభావంతులను వెలికితీసేందుకు, కొత్త ఆలోచలనకు అంకురార్పణ చేసేందుకు లఘు చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. సినిమాల్లో ప్రజల సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించాలని మంత్రి జూపల్లి.. ఔత్సాహిక దర్శక నిర్మాతలకు సూచించారు.కాగా, ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక, నిర్వాహకులు ఉమా మహేశ్వరరావు, ఇతర ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఎఫ్‌డీసీ, దాదా సాహెబ్ పాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఐమ్యాక్స్‌లో రేపు, ఎల్లుండి ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చిత్రాలను ప్రదర్శించనున్నారు. సుమారు 10 దేశాల నుంచి 700కుపైగా లఘు చిత్రాలు ప్రదర్శనకు రాగా.. వాటిలో ఉత్తమ చిత్రాలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేసి ప్రదర్శించనున్నారు.

# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

**ఏఎం న్యూస్, రాజన్నసిరిసిల్ల,డిసెంబర్19:**
పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు.

ఏ పార్టీలో ఉన్నారో చెప్పు కోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతు న్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

# 41మంది మావోయిస్టుల లొంగుబాటు


**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్19:**
నిషేధిత మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.నక్సలిజాన్ని రూపుమాపేందుకు, మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంతోమంది మావోలు భద్రతబలగాల ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ క్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 40 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలో మావోయిస్టులు కలిసిపోయారు.. లొంగిపోయిన వాళ్లలో ముగ్గురు రాష్ట్రస్థాయి లీడర్లు.. కొందరు హిడ్మా బెటాలియన్ కమాండర్స్ ఉన్నారు. లొంగిపోయిన వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టుల వద్ద నుంచి 24 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. తెలంగాణ పోలీసుల మేజర్ ఆపరేషన్ సక్సెస్ తో మావోయిస్ట్ పార్టీ కి మరో ఎదురు దెబ్బ తగిలిన్లటైంది.

# ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా తేనీటి విందు

**ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,డిసెంబర్19:**
పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య ముగిసాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈ టీపార్టీకి విపక్ష ఎంపీలు కూడా హాజరయ్యారు. స్నేహపూర్వక వాతావరణంలో సరదా ముచ్చట్లతో సభ్యులంతా సందడిగా గడిపారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనలో ఉండటంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పీకర్ ఇచ్చిన టీపార్టీలో పాల్గొన్నారు. విపక్షం తరఫున ప్రాతినిధ్యం వహించారు. 20 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓం బిర్లా, మోదీతో పాటు రాజ్‌నాథ్ సింగ్ కూర్చుని ఉండగా ఆయన పక్కన ప్రియాంక ఆసీనులయ్యారు. తన నియోజకవర్గం వయనాడ్ నుంచి తెచ్చుకున్న ఒక మూలికను ఎలర్జీ రాకుండా తీసుకుంటూ ఉంటానని ప్రియాంక వివరించారట. మోదీ ఇటీవల జరిపిన ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ పర్యటన గురించి ప్రియాంక అడగగా, బాగా జరిగిందని ఆయన బదులిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత సుప్రియా సులే, సీపీఐ నేత డి.రాజా కూడా సమావేశం లో పాల్గొన్నారు. శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్ తదితర విపక్ష ఎంపీలను పీఎం అభినందించారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని పలువురు ఎంపీలు మోదీని కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైర్‌మెంట్ అయిన ఎంపీలు చర్చించుకునే వారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశంలో నవ్వులు వెల్లివిరిసాయి. విపక్ష పార్టీ సభ్యులను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ గత పర్యాయం స్పీకర్ టీ పార్టీని రాహుల్, ఇతర విపక్ష నేతలు బాయ్‌కాట్ చేశారు. అయితే ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విపక్షాల విషయంలోనూ స్పీకర్ సముచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయ పడ్డారని, స్పీకర్ టీపార్టీకి విపక్ష ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

# ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

**ఏఎం న్యూస్, హైదరాబాద్,డిసెంబర్19:**



ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకోసం తామంతా అహరహం శ్రమిస్తున్నామని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్దిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.

# మెడికో విద్యారుణం కోసం ఇల్లు తాకట్టు

**ఏఎం న్యూస్, సిద్దిపేట,డిసెంబర్19:**
బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తన పెద్ద మనసును చాటుకున్నారు. పీజీ వైద్యవిద్య చదువుతున్న ఓ పేద విద్యార్థినికి రుణం కోసం తన ఇంటిని హామీగా పెట్టి రుణం ఇప్పించారు. విద్యార్థిని మమత చదువు కోసం ఏటా రూ.7.50 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఏదైనా ఆస్తి తనఖా పెడితేనే రుణం ఇస్తామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని హరీశ్‌రావు దృష్టికి మమత, ఆమె తండ్రి రామచంద్రం తీసుకెళ్లారు. దీంతో ఆయన సిద్దిపేటలోని తన ఇంటిని తనఖా పెట్టి రూ.20 లక్షల విద్యారుణం ఇప్పించారు. విద్యార్థిని హాస్టల్ ఫీజు కోసం రూ.లక్ష నగదు అందజేశారు. హరీస్ రావు చొరవతో తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. ఆయనకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి నియోజకవర్గానికి సాగునీరు

### – వచ్చే జూన్ నాటికి సీతారామతో నీరు అందిస్తాం
### – పాలేరుకు గోదావరి జలాలను రప్పించడమే లక్ష్యం
### – జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసే సంకల్పంతో పనులు
### – మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

**ఏఎం న్యూస్, ఖమ్మం,డిసెంబర్19:**



ఖమ్మం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రాబోయే జూన్ నాటికి 25 వేల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. టన్నెల్స్ అన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి అన్నదాతలకు సాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు. పాలేరుకు గోదావరి జలాలు వస్తేనే సీతారామ లక్ష్యం పూర్తవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు తుమ్మల. మరోవైపు స్వామి నారాయణ స్కూల్ నిర్మాణం జరుగుతోందని.. వెలుగుమట్ల అర్బన్ పార్క్ నిర్మాణం పూర్తి చేసి మంచి మ్యూజియం, పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాను అన్ని విధాలా నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న పనులను వివరించారు. పర్యాటక ప్రాంతంగా ఖమ్మంను అభివృద్ధి చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి. ప్రపంచస్థాయి డిజైన్‌తో నగరంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ పూర్తి కావొచ్చిందని వెల్లడించారు. ఖిల్లాకు రోప్ వే పనులు ప్రారంభమయ్యాయని.. జూన్ నాటికి మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం పూర్తి కావొచ్చిందని.. అలాగే శిల్పారామం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో హరిత హోటల్ నిర్మాణం చేయబోతున్నామని చెప్పారు. 20ఎకరాలను టీటీడీకి అందజేస్తున్నామని.. వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ మిగిలిన అన్ని చెరువులకూ కృష్ణా జలాలు అందజేస్తున్నామని అన్నారు.

### షాహి ఎక్స్పోర్ట్స్ మహిళ కార్మికుల

# న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**– నెల్లికంటి సత్యం CPI ఎమ్మెల్సీ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించాలని డిమాండ్ చేసిన సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



**ఏ ఎం న్యూస్ ఓయూ:**
మల్లాపూర్ మణిక్‌చంద్ రోడ్‌లోని షాహి ఎక్స్‌పోర్ట్ కంపెనీలో కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లతో విధులు బహిష్కరించి , సమ్మె చేపట్టి ఆందోళన నేటికీ 12వ రోజు చేరింది. ఈ సమ్మెకు టి. సత్యప్రసాద్ సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి అధ్యక్ష వహించగా సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం షాహి ఎక్స్పోర్ట్స్ మహిళ కార్మికులు చేస్తున్నటువంటి 12వ రోజు సమ్మెకు మద్దతు తెలియజేశారు.. యాజమాన్యం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆర్థిక పోరాటాన్ని ప్రారంభించిన కార్మిక వర్గానికి నెల్లికంటి సత్యం(MLC) విప్లవ జేజేలు తెలియజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించకుండా, కార్మికులపై అధిక పనిభారం మోపడం, హక్కుల కోసం ప్రశ్నించిన కార్మికులను ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరించడం, కార్మికుల శ్రమదోపిడీ ద్వారా అధిక లాభాలు సంపాదించడం వంటి చర్యలు షాహి ఎక్స్‌పోర్ట్ యాజమాన్యం అమలు చేస్తున్న తీవ్ర అన్యాయం అని నాయకులు అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తో చర్చించి షాహి స్పోర్ట్స్ మహిళా కార్మికులు సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చేస్తానని చెప్పారు, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వాస్తవాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని నెల్లికంటి సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాహి ఎక్స్‌పోర్ట్ కార్మికులు పెరిగిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల వేతనాలు నిర్ణీత సమయానికి ఇవ్వాలని, ఇప్పటివరకు పరిష్కరించని కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ పోరాటానికి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, కార్మిక పక్షపాత శక్తులు, రాజకీయాలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలుపాలని పోరాడుతున్న మహిళ కార్మికులు పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు కార్మికులు ఐక్యంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తానని, మహిళా కార్మికుల జీతాలు పెరిగేంతవరకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని సత్యం MLC పేర్కొన్నారు. ఈ సమ్మెలో సంఘీభావంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి .ఎస్ .బోస్ , సిపిఐ జాతీయ సమితి సభ్యురాలు ప్రేమ పావని, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి దామోదర్ రెడ్డి, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చ కిషన్, ధర్మేంద్ర, శంకర్. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మీనారాయణ, నారా నరసింహ, యాదగిరి, లక్ష్మి, ఏఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు గిరిబాబు, నాయకులు పవన్ పాల్గొని కార్మికుల పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించారు.

# ఫేస్ 1లో బెసేత్తా క్రైస్ట్ వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ఎ ఎం న్యూస్ పటాన్‌చెరు :**
రోమన్ క్రైస్తవ చరిత్రకారుడు సెక్టస్ జూలియస్ ఆఫ్రికనస్ ప్రకారం యేసు మార్చి 25వ తారీకు నుండి 9 నెలల తర్వాత డిసెంబర్ 25 తారీఖున జన్మించాడు ఫలితంగా పుట్టిన తేదీ నిర్ణయించబడింది.. క్రిస్మస్ కి ముందే ప్రపంచవ్యాప్తంగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకుంటారు క్రైస్తవ సోదరులు. అటువంటి సెమీ క్రిస్మస్ వేడుకలను సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరువు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1( రెండు పడకల సముదాయం, కేసీఆర్ నగర్ గా పిలవబడే ఫేస్ 1) లో 7 వ బ్లాక్, 8 బ్లాకు, 9ఎ బ్లాక్ లోని క్రైస్తవ సోదరులు, సోదరీమణులు అందరూ కలిసి బెసేత్తా క్రైస్ట్ వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను (కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1 సముదాయంలో) ఘనంగా(17/12/2025 బుధవారం) జరిపారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకల లో కార్యక్రమ నిర్వాహకుల ఆహ్వాన మేరకు పాస్టర్ దిమోతి, పాస్టర్ దేవిడ్ రాజు, పాస్టర్ సామ్యేల్ బాబు, పాస్టర్ నతాన్ యేలు, పాస్టర్ ధర్మరాజు, పాస్టర్ సత్యము, పాస్టర్ ప్రదీప్, లు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభు సందేశాన్ని దైవజనులకు వివరించారు. ప్రతి ఒక్క పాస్టర్ చేసిన ప్రసంగం అక్కడ ఉన్న క్రైస్తవ సోదరీ,సోదరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నహేమియా, వి సురేష్, కళ్యాణ్, పుల్లారావు, సామ్యేల్ రాజు, జాశ్వ దానియేలు, దావీద్, సత్యనారాయణ, ఆనంద్ పాల్గొని ప్రభువు సందేశాన్ని విని ఏసుప్రభు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తన భుజాన వేసుకొని విజయవంతం కావడంలో తన వంతు పాత్ర పోషించారు సురేష్. ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు క్రైస్తవ సోదరీ, సోదరీమణులు చేసిన భక్తి గీతాలతో కార్యక్రమం ప్రాంగణం మొత్తం భక్తి మయమైంది యేసయ్య యేసయ్య అంటూ ఆలపించిన గీతాలు ఈ కార్యక్రమానికి పాల్గొన్న 600 మంది ని భక్తి భావంతో తమను తాము మర్చిపోయి యేసయ్య కృపకు పాత్రులు అయ్యారు. నహేమియా వచ్చిన ప్రతి ఒక్కరిని ప్రేమగా పలకరించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ముందుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంఘ కాపరులు తీసుకువచ్చిన ప్రత్యేక క్రిస్మస్ కేకును ముఖ్య అతిథుల సమక్షంలో కట్ చేశారు కమిటీ నిర్వాహకులు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ కు ఆహ్వానించామని. వారికి అత్యవసర కార్యక్రమం ఉండడం వలన రాలేకపోయారని సందేశం వచ్చిందని సురేష్ తెలిపారు. ఫేస్ 1 జిహెచ్ఎంసి ఇంచార్జ్ రాహుల్‌కి శాలువాతో ఘనంగా సన్మానించారు కమిటీ నిర్వాకులు.

# హ్యాట్రిక్ విజేతగా కొల్లూర్ ఫేస్ 1 మూడవ బ్లాక్(3)



**ఏ ఎం న్యూస్ పటాన్‌చెరు:**
ఎన్నికలలో ఒకసారి కాదు, రెండోసారి కాదు, మూడోసారి కూడా విజయాన్ని అందుకొని హ్యాట్రిక్ విజేత గా స్థానాన్ని నిలుపుకుంది సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్ చెరువు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1( రెండు పడకల సముదాయం ఫేస్, కెసిఆర్ నగర్ ఫేస్ 1) లోని 3 వ ( మూడవ బ్లాక్ ).వివరాల్లోకెళ్తే మూడో బ్లాక్ లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో లబ్ధిదారులైన స్వాతి (109)టీం గెలిచారు. గత నెలలో (నవంబర్ 2025) జరిగిన ఎన్నికలలో రెండవసారి విజయాన్ని అందుకున్నారు స్వాతి రెడ్డి. ఈ నెలలో(2025 డిసెంబర్ 18) జరిగిన ఎన్నికలలో రెండు టీములు పాల్గొన్నారు ఒక్కొక్క టీం లో 9 మంది సభ్యుల చొప్పున మొత్తం రెండు టీంలు కలిపి 18 మంది సభ్యులు ఎన్నికలలో పాల్గొన్నారు ఈ ఎన్నికలను రిటైర్డ్ ఆఫీసర్ చంద్రయ్య నిర్వహించారు. హోరా హోరీగా సాగిన ఈ ఎన్నికలలో విజయం స్వాతి టీంకి భరించింది. చంద్రయ్య ప్రకటించిన వివరాల ప్రకారం అధ్యక్షురాలుగా స్వాతి (109), ఉప అధ్యక్షురాలుగా పార్వతమ్మ(611), సెక్రటరీగా బీరమ్మ(405), ట్రెజరర్ గా సరిత (406), కమిటీ సభ్యులుగా సరిత(903), మల్లమ్మ(307), శోభారాణి(204) మల్లమ్మ(806) సునీత(312) ఎన్నిక అయ్యారు అని వెల్లడించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ ఈ విజయాన్ని ఇచ్చినందుకు మూడో బ్లాక్ లోని సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నా శ్రీవారు( రాజేశ్వర్ రెడ్డి ) ప్రోత్సాహంతోనే నేను ముందుకు వెళ్తున్నానని అన్నారు స్వాతి టీం విజయం సాధించిన సందర్భంగా టపాసులు పేల్చి కేకులు కట్ చేసి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. గెలిచిన 9 మంది సభ్యులు అందరూ కలిసి చంద్రయ్యకి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. రాజేశ్వర్ రెడ్డి స్వామి, వారి టీం అందరూ కలిసి గెలిచిన సభ్యులకు శాలువాతో ఘన సన్మానం చేశారు. ఏది ఏమైనా మూడుసార్లు ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ విజేతగా నిలిచిన ఫేస్ వన్ మూడో(3వ) బ్లాక్ ను ఆదర్శంగా తీసుకోవాలని రెండు పడకల సముదాయం ఫేస్ వన్ (1)లోని లబ్ధిదారులు చర్చించుకుంటున్న విషయం ఏ.ఎమ్. న్యూస్ రిపోర్టర్ కి కనపడింది.

## ఫేస్ టూ లో యువతి అనుమానాస్పద మృతి దర్యాప్తు చేస్తున్న కొల్లూరు పోలీసులు



**ఎ ఎం న్యూస్, పటాన్ చెరు:**
ఒకే ప్రైవేట్ కంపెనీలో పనిచేసే సహోద్యోగుల మధ్య పరిచయం ఒక యువతి ప్రాణాలను బలితీసుకున్న విషాద సంఘటన తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండు పడగల సముదాయం ఫేస్ 2 లో కేసీఆర్ నగర్‌లో చోటుచేసుకుంది.. కొల్లూరు పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు సకిన ఫాతిమా, హుస్సేనాలి ఇద్దరూ ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ ఒకరికొకరు పరిచయస్తులు గా ఉన్నారు ఫాతిమా కుటుంబానికి కేసీఆర్ నగర్ ఫేస్ 2 లో బ్లాక్ నంబర్ 40లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు గత ప్రభుత్వం కేటాయించింది. గురువారం ఫాతిమా హుస్సేనాలి కలిసి ఫాతిమా కు వచ్చిన డబుల్ బెడ్‌రూమ్‌కి వచ్చారు అదే సమయం లో తండ్రి రాగా, తండ్రి గొంతు విన్న ఫాతిమా భయంతో, తండ్రికి దొరికిపోతామనే ఆందోళనతో, ఆమె బాల్కనీ గుండా పక్క ఫ్లాట్‌లోకి వెళ్లడానికి హుస్సేనాలి సహకారం తో ప్రయత్నించింది. ఈ క్రమంలో పట్టుతప్పి ఎనిమిదో అంతస్తు నుండి కింద పడిపోయింది. తీవ్ర గాయాలవ్వడంతో ఫాతిమా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ సమాచారం అందుకున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ పోలీసులు ఆమె ఆస్పద ముద్దుగా కేసు మోజు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అంతర్జాతీయ పోటీలో నిలవాలంటే

## ఈఎస్‌జీ తప్పనిసరి: జయేష్ రంజన్



**సికింద్రాబాద్, డిసెంబర్ 19:**
ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్) నిబంధనలకు అనుగుణంగా లేకపోతే అంతర్జాతీయ మార్కెట్లలో కంపెనీలు నిలదొక్కుకోలేవని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. బేగంపేటలో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఎస్‌జీ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటెక్ ఉత్పత్తులు 93 దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, అయితే ఈఎస్‌జీకి కట్టుబడి లేకపోతే యూరోపియన్ దేశాలు ఉత్పత్తులపై నిషేధం విధించే అవ కాశం ఉందని హెచ్చరించారు. అంతర్జాతీయ మార్కెట్లకు, ముఖ్యంగా యూరోప్‌కు ప్రాప్తి కోసం ఈఎస్‌జీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2047 నాటికి భారతదేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని, ఎగుమతుల ద్వారానే రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించగలదని తెలిపారు. ఈఎస్‌జీ సర్టిఫికేషన్ కార్యక్రమాలు ప్రారంభించిన హెచ్ఎంఏ చర్యలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నలంద విశ్వ విద్యాలయ మాజీ వీసీ ప్రొఫెసర్ సునయనా సింగ్ విజన్, విధానాలతోనే సుస్థిర అభివృద్ధి సాధ్య మని చెప్పారు. హెచ్ఎంఏ అధ్యక్షుడు అల్వాల దేవేందర్ రెడ్డి గ్రీన్ జీవన విధానంగా మారాలన్నారు.

## సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

**ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :**



సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ అనే ప్లాస్టిక్ వస్తువుల దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణంలో ఒక్కసారిగా దట్టమైన పొగలు అలుముకోవడంతో పాటు భారీగా మంటలు చెలరేగడంతో మార్కెట్ ప్రాంతమంతా భయాందోళన నెలకొంది. వ్యాపారులు, కొనుగోలుదారులు హడావుడిగా దుకాణాల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, దుకాణదారుడు నిత్యవిధిగా దీపం వెలిగించే సమయంలో అది ప్రమాదవశాత్తు కింద పడిపోయి, అక్కడ నిల్వ ఉంచిన ప్లాస్టిక్ సామగ్రికి అంటుకోవడంతో అగ్ని ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. దుకాణంలో పూర్తిగా ప్లాస్టిక్ వస్తువులే ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి దట్టమైన నల్లటి పొగలు ఎగసిపడ్డాయి. కొన్ని నిమిషాల్లోనే పరిస్థితి అదుపు తప్పడంతో మార్కెట్‌లో కలకలం రేగింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, సికింద్రాబాద్ నుంచి అగ్నిమాపక వాహనాలు ఘటన స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలువురు అగ్నిమాపక సిబ్బంది పొగ మధ్యలోకి వెళ్లి నీటి జెట్లు ప్రయోగిస్తూ పరిస్థితిని నియంత్రించారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశమని అధికారులు తెలిపారు. అయితే, దుకాణంలో ఉన్న ప్లాస్టిక్ సామగ్రి పూర్తిగా దగ్ధమై భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. నష్ట పరిమాణంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అగ్ని ప్రమాదం కారణంగా మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అగ్నిమాపక వాహనాలు, పోలీసుల రాకపోకలతో ప్రధాన రహదారులపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లిస్తూ భద్రత చర్యలు చేపట్టారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి అగ్ని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు.




## ఘనంగా లాంచ్ గర్ల్ పరిచయ కార్యక్రమం

**ఏ ఎం న్యూస్ ఓయూ:**



గోల్కొండ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం లాంచ్ గర్ల్ (లాంచ్ గర్ల్ ఫ్యూచర్ రెడీ) పరిచయ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లాంచ్ గర్ల్ ఫౌండర్ అవేరల్ స్పెన్సర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జయవర్ధన్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.హుమేర సయీద్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు లాంచ్ గర్ల్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమము ఇంచార్జ్ కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థినీ లు పాల్గొన్నారు.

## ఆశ్రమం నుంచి యువతి అదృశ్యం



**ఏ ఎం న్యూస్ ఓయూ:**
ఓ యువతి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం తార్నాక లోని ఆర్డిఎస్ శక్తి సదన్ లో ఆశ్రయం పొందుతున్న వి లక్ష్మీ ప్రసన్న(18) ఈనెల 17న ఆశ్రమం నుంచి తప్పించుకుని వెళ్లారు. ఇప్పటికి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆశ్రమ నిర్వాహకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ఈ యువతి కి మతిస్థిమితం సరిగా లేదని, గతంలో పలు పర్యాయాలు ఆశ్రమంలో ఉండలేక పారిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు.

## అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**



రహమత్ నగర్( డివిజన్) కూడలిలో అన్నపూర్ణ దేవి అన్న సమర్పణ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ నిర్వాహకుల పిలుపుమేరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్. వి.నవీన్‌యాదవ్ ముందుగా అన్నపూర్ణ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌కు శాలువాతో ఘనంగా సన్మానించారు బి. భవాని శంకర్ (కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి రహమాత్ నగర్ డివిజన్). ఈ కార్యక్రమంలో కృష్ణ మూర్తి, నాగరాజు, నటరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఇంతటి మహోత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన అన్నపూర్ణాదేవి అన్న సమర్పణ సొసైటీ సభ్యులను పేరుపేరునా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### డిసెంబర్ 21(2025)న జరిగే

## సన్మాన మహోత్సవంలో పాల్గొనండి

**- నిర్మాత మదాల నాగూర్..**



**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**
మన కళాక్షేత్రం, ఆర్. కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెండితెర ఆణిముత్యాలకు సన్మాన మహోత్సవ కార్యక్రమం డిసెంబర్ 21, 2025(ఆదివారం) సాయంత్రం 6 గంటలకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న ప్రసాద్ ల్యాబ్ లో ఘనంగా జరుపుతున్నామని చిత్ర నిర్మాత మదాల నాగూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఇదే మా ఆహ్వానం అని అన్నారు ఈ కార్యక్రమంలో జరిగే గోల్డెన్ సత్కారంలో అందరూ పాల్గొనాలని ఇదే మా ఆహ్వానం అని అన్నారు. మదాల నాగూర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి సినిమా టీవీ రంగాల్లో కొనసాగుతూ నటనకు జీవం పోసి నవరసాలను అలవకుగా పండించి, నటన అంటే ఇది అని చాటి చెప్పి, మనిషి నిద్రపోయి కనేది కల, మనిషిని నిద్రలేపేది కల అంటూ ఎందరికో స్ఫూర్తిని ఇస్తూ సినీ రంగంలో కొనసాగుతున్న వెండితెర ఆణిముత్యాలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

## వందరోజుల బాల్య వివాహ నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న సీతా దయాకర్ రెడ్డి

**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**



జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ (డివిజన్) నాట్కో ప్రభుత్వ హై స్కూల్‌లో 100 రోజుల బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఆస్రిత ఎన్‌జీఓ సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమం ద్వారా సుమారు 1,500 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఎస్సిపిసిఆర్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి తో పాటు ఎస్సిపిసిఆర్ సభ్యురాలు వందనా గౌడ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, (మహిళా భద్రతా విభాగం) లావణ్య జావెద్, తో పాటు యునిసెఫ్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్ పాల్గొన్నారు. వీరితోపాటు జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీనివాస్, ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయభాస్కర్, మండల రెవెన్యూ అధికారి ప్రేమ్ కుమార్ (ఖైరతాబాద్ మండలం) చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, (ఖైరతాబాద్ )పుష్ప ఆస్రిత,ఎన్‌జీఓ డైరెక్టర నాట్కో ప్రభుత్వ హై స్కూల్ ప్రిన్సిపల్ గీత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు ప్రమోద పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డి సి పి యూ బృంద సభ్యులుఉదయ్ కేర్ ఎన్‌జీఓ ప్రతినిధులు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎ సి పి), యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఎ హెచ్ టీ యూ) సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, ముఖ్యంగా బాలికల భద్రత, గౌరవం, ఉజ్వల భవిష్యత్తు కోసం సమిష్టి అవగాహన ఎంత ముఖ్యమో వివరించారు. సెల్ ఫోన్ వాడకం గురించి విద్యార్థులకు వివరిస్తూ మనకి అవసరమైన విషయాలే తీసుకోవాలి తప్పితే అనవసరమైన విషయాల జోలికి పోవద్దని తెలిపారు. కార్యక్రమం చివరలో విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేపించారు.

# సనాతన ధర్మం కాపాడుకోవడం అందరి బాధ్యత

## కాశీ విశ్వేరుడిని దర్శించుకున్న బాలయ్య, బోయపాటి



వారణాసిలోని కాశీ విశ్వనాథ స్వామిని అఖండ-2 బృందం దర్శించుకుంది. నటుడు నందమూరి బాలకృష్ణ దర్శకుడు బోయపాటి కలసి కాశీని సందర్శించారు. అఖండ 2' చిత్రానికి వస్తున్న అపూర్వ స్పందన నేపథ్యంలో చిత్రయూనిట్‌తో కలిసి బాలయ్య ఆధ్యాత్మిక నగరమైన కాశీకి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. నేటి తరం సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'అఖండ 2' సినిమాలో తాను సనాతన సైనికుడిగా నటించానని, ఆ పాత్ర తనకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చిందని బాలకృష్ణ వెల్లడించారు. ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను నిర్మాతలు, దర్శకుడు కలిసి కలసి సినిమా గురించి వివరించారని బాలయ్య పేర్కొన్నారు. సినిమా సందేశం, సనాతన ధర్మంపై ఉన్న అంశాలు ఆయనను ఆకట్టుకున్నాయని చెప్పారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'అఖండ 2' భారీ అంచనాల మధ్య డిసెంబర్ 12న థియేటర్లలోకి వచ్చింది. విడుదలైన తొలి రోజునుంచే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. బాలకృష్ణ అఘోరగా కనిపించిన లుక్, పవర్‌ఫుల్ డైలాగ్స్, మాస్ ఎలివేషన్లు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఫస్ట్ వీక్‌లోనే గట్టి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, ఇప్పుడు కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ విజయవంతంగా రన్ అవుతోంది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట కలిసి నిర్మించారు. ఎస్.ఎస్. థమన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. సంయుక్త మీనన్, హర్షాలీ మల్హోత్ర కీలక పాత్రల్లో నటించి కథకు మరింత బలం చేకూర్చారు. 'అఖండ 2' విజయం నేపథ్యంలో కాశీలో స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఈ సినిమా తన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని బాలకృష్ణ తెలిపారు. ఇది కేవలం తెలుగు సినిమా కాదని, భారతీయులందరి చిత్రమని పేర్కొన్నారు. మంచి సినిమా కోసం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సక్సెస్ ఈవెంట్ నిర్వహించిన టీమ్ ఇప్పుడు ఉత్తరాదిలో సినిమాని ప్రమోట్ చేస్తోంది.

# నిధి అగర్వాల్ పట్ల అనుచిత ప్రవర్తన

## దర్యాప్తు చేపట్టిన పోలీసులు



నిధి అగర్వాల్ గత కొన్ని రోజులుగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన పేరు. ఇటీవల హైదరాబాద్‌లోని లూలు మాల్‌లో 'రాజాసాబ్' సినిమా సాంగ్ ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమెకు ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. ప్రమోషన్ ఈవెంట్‌కు భారీగా తరలివచ్చిన అభిమానులు నిధి దగ్గరకు చేరుకునేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది. కొందరు హద్దులు దాటి ప్రవర్తించడంతో నిధి తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు సమాచారం. ఈ ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మహిళల భద్రతపై మరోసారి ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. పరిస్థితి తీవ్రతను గమనించిన బాడీగార్డులు వెంటనే రంగంలోకి దిగడంతో నిధిని అక్కడి నుంచి సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిధి అగర్వాల్‌కు సంబంధించిన పాత వీడియోలు, ఇంటర్వ్యూల్లో చేసిన వ్యాఖ్యలు నెట్టింట మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఆమె గతంలో కాస్టింగ్ కౌచ్ అంశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఓ ఇంటర్వ్యూలో నిధి మాట్లాడుతూ, సినిమా పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనేది 'రాక్షసి లాంటిదని' పేర్కొన్నప్పటికీ, అది తనకు వ్యక్తిగతంగా ఎదురుకాలేదని చెప్పింది. అలాంటి పరిస్థితి వస్తే చాలా బాధగా అనిపిస్తుందని ఆమె స్పష్టం చేసింది. ఇప్పుడు లూలు మాల్ ఘటన తర్వాత ఆమె అప్పటి వ్యాఖ్యలు మరోసారి వెలుగులోకి రావడంతో, అభిమానులు మరియు నెటిజన్లు నిధికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తోంది.

# ఓ మంచి సినిమా ప్రయత్నంలో ఉన్నాం

## డెకాయిట్‌పై అడవి వేష్ కామెంట్





ఆలస్యమైనా ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలన్నదే నా తపన. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న 'డెకాయిట్' విషయంలో మేమంతా గర్వపడుతున్నాం అని అడివి శేష్ అన్నారు. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు అడివి శేష్ మాట్లాడుతూ ఎక్కడికి పోయాడు? ఏం చేస్తున్నాడు? అంటూ నా గురించి ఎక్స్‌లో చర్చ జరుగుతోంది. నేను ఎక్కడికీ పోలేదు. ఈ సినిమానే చేస్తున్నా. ఇలా చాలా పెద్ద సినిమా. తెలుగు, హిందీ భాషల్లో చేశాం. నేను, షానియల్ కలిసి రాశాం. అనురాగ్ కశ్యప్ మాకు మార్గనిర్దేశనర చేశారు. మృణాల్ అద్భుతమైన నటనని ఇందులో చూస్తారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందడానికి కారణం నిర్మాత సుప్రియ. సునీల్, జాన్వి ఈ సినిమాని మరింత ముందుకు తీసుకెళుతున్నారు. ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో నటించడమే నా లక్ష్యం అని అన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. హృదయం పెట్టి పనిచేశా. 'సీతారామం' సినిమాని స్వప్నతో, ఇప్పుడు సుప్రియ... మహిళా నిర్మాతలతో కలిసి సినిమా చేయడం చాలా బాగుంది. శేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఈ సినిమాకోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 14ఏళ్ల కిందట కాలిఫోర్నియాలో శేష్ అన్నను కలిసినప్పుడు ఒక కథ గురించి మాట్లాడుకున్నాం. అక్కడ మొదలైన ప్రయాణం ఈ సినిమా వరకూ చేరింది. నేను ఈ దేశంలో ఉండటానికి కారణం ఆయనే. ఆయన మార్గనిర్దేశకత్వరలోనే ఈ సినిమా చేశానని అన్నారు.



# Mana Cinemalu

# దురంధర్ కలెక్షన్ల వర్షం

## నెట్‌ఫ్లిక్స్‌లో భారీ ఆఫర్




బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధార్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు థియేటర్‌లలో ఈ చిత్రం దూసుకుపోతుండగా.. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించి ఒక భారీ డీల్ కుదిరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా కోసం ఏకంగా రూ. 285 కోట్లు చెల్లించినట్లు టాక్ నడుస్తోంది. ఇది 'పుష్ప 2' ఓటీటీ డీల్ కంటే ఎక్కువ అని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. థియేటర్లలో విడుదలైన 8 వారాల తర్వాత, అంటే 2026 జనవరి 30న లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండటంతో, ఈ డీల్ రెండు భాగాలకు కలిపి జరిగిందా లేక మొదటి భాగానికే ఇంత భారీ మొత్తం ఇచ్చారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. ఫుల్ రన్ ముగిసే సమయానికి రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరుతుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రణవీర్ సింగ్, ఆర్. మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. 'ధురంధర్: రివెంజ్' పేరుతో పార్ట్ 2 వచ్చే ఏడాది మార్చి 19, 2026న విడుదల కానుంది.

# మెగా ఫ్యాన్స్‌తో అనిల్ రావిపూడి మీట్ అండ్ గ్రీట్



అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సినిమా మన శంకర వరప్రసాద్ గారు. నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అనిల్ రావిపూడి నుండి వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ÷న్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి మరియు గోల్డ్ బాక్స్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కనుకాగా జనవరి 12న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది మన శంకర వరప్రసాద్ గారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ అభిమానులతో మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి. ఫ్యాన్స్ కి గిఫ్ట్ హ్యాంపర్లు తో పాటు నూతన సంవత్సర క్యాలండర్స్, మనశంకర వరప్రసాద్ టీ షర్ట్స్.. పెన్ తో పాటు స్వీట్స్ మరికొన్ని మరికొన్ని బహుమతులు అందజేశారు. సినిమాకు సంబందించిన ముచ్చట్లతో పాటు ఇతర విశేషాలను కూడా ఫ్యాన్స్ తో పంచుకున్నారు మేకర్స్. అలాగే మెగాస్టార్ చిరు నుండి వింటేజ్ కామెడీ సినిమా వచ్చి చాలా కాలం అయింది ఇప్పుడు అలంటి సినిమాను ఇస్తున్నందుకు దర్శకుడు అనిల్ రావిపూడికి అభినందనలు తెలిపారు. వింటేజ్ స్టైల్ చిరు కామెడీ టైమింగ్ కు అనిల్ రావిపూడి మేకింగ్ కలగలిపి మన శంకర వరప్రసాద్ గారు సూపర్ హిట్ అవుతుందని ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.